

వికలాంగుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి -నెల్లూరు
జిల్లాలోని 38 మండల కేంద్రాల్లో 14వ తేదీ నుంచి వికలాంగులకు అసెస్మెంట్ క్యాం పులు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ వారి చాంబర్లో వికలాంగుల నైపుణ్యాభివద్ధి, సాధికారత, పునరావాస కల్పన సమ్మిళిత కేంద్రం (సి ఆర్ సి) ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ సీఆర్సీ కేంద్రం ఆధ్వర్యంలో ఒక్కొక్క మండల కేంద్రంలో ఒక్కొక్క సోమవారం ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో వివిధ పరికరాల కోసం వికలాంగుల నుంచి దరఖాస్తు స్వీకరించి, వారికి అవసరమైన పరికరాలను అందించాలని చెప్పారు. డిఆర్ఓ లవన్న, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి వినయ్ కుమార్, డిఎం అండ్ హెచ్వో పెంచలయ్య, జడ్పీ సీఈవో ఖాదర్బాషా, సీఆర్సీ కేంద్రం డైరెక్టర్ మనోజ్ కుమార్, కే ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఇసుక మాఫియా మాయాజాలం..!

ఇసుక సామాన్యులకు అందడం లేదు..ఉచితంగా అందరికీ అందిస్తామని ప్రభుత్వం చెప్పిన మాట చెల్లుబాటు కావడం లేదు..రాష్ట్ర ప్రభుత్వం జులై 8 నుంచి ఇసుక ఉచితంగా ఇవ్వడానికి అనుమతించింది..రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారికంగా ప్రకటించారు.. ఇందుకు సంబంధించిన జిఒ విడుదల చేసింది..2014-19 మధ్య కాలంలో ఉచితంగా అందిన ఇసుకలా ఉంటుందని అందరూ భావించారు..ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు. టన్ను రూ.350 ధర నిర్ణయించారు. రవాణా ఛార్జీలు, ప్రకటించారు. జిపిఎస్ ద్వార వాహనాలు పంపుతామని చెప్పారు. ఇదంతా కాగితాల వరకే అధికారపార్టీ నేతలు కొందరు ఇసుక మాఫియాతో కలిసిపోయి ఇసుక బుకింగ్ వారిచేతిలోకే వెళ్లింది. రవాణా వారే చేస్తున్నారు. ధరలు మాత్రం గత ప్రభుత్వం కన్నా ఏమీ తక్కువగా లేదు. మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు అధికారపార్టీనేతలు చెప్పినదానికి సలాం కొడుతూ, గులాం చేస్తున్నారు.. సామాన్యులకు మాత్రం ఇసుక అందని ద్రాక్షలా మారిపోతోంది..

బుకింగ్.. సరఫరా వారే .. - బ్లాక్‌లో టిప్పర్ రూ. 36వేలు

కోవూరు సుగర్ ఫ్యాక్టరీ నుంచి ఇసుక తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి
వైఎస్ఆర్‌పి ప్రభుత్వం గతంలో ఇసుక విషయంలో సామాన్య ప్రజలు, వినియోగదారులను అనేక ఇబ్బందులకు గురిచేసింది. అప్పటి నాయకులు ఇసుకపై కోట్లు దోపిడీ చేశారనే పేరు తెచ్చుకున్నారు. ఉచితంగా వచ్చే ఇసుకను అమ్మకానికి పెట్టి భవన నిర్మాణ దారులు, కార్మికుల కడుపుకొట్టారని, అప్పట్లో టిడిపి నేతలు విమర్శలు గుప్పించారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు కంపెనీలకు ఇసుక అమ్మకాలు కట్టబెట్టడంతో జిల్లాలో డంపింగ్ యార్డ్‌లు వచ్చాయి. జిల్లాలో మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు, వెంకటాచలం, కావలి ప్రాంతాల్లో డంపింగ్ యార్డ్‌లు ఏర్పాటు చేశారు. పెన్నా నది నుంచి ఇక్కడకు ఇసుక తరలించి, అక్కడ నుంచి వినియోగదారులకు అమ్మేవారు. ట్రాక్టర్ రూ.5 వేలు, టిప్పర్ రూ.18 వేల వరకు ధర పలికింది. ఇది అప్పట్లో భవన నిర్మాణ యజమానులకు మోయలేని భారం.. ప్రభుత్వం మారితేనైనా ఇసుక కష్టాలు తీరుతాయని అందరూ భావించారు. చంద్రబాబునాయుడు మళ్లీ వస్తే కష్టాలు తీరుతాయని ఆశపడ్డారు. జూన్ 4న ఫలితాల్లో టిడిపి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మారడంతో ఇసుక ఉచితంగా వస్తుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సందెట్లో సడేమియా అన్నట్లు టిడిపి నేతలు డంపింగ్ యార్డ్‌ల్లో ఉన్న ఇసుకను ఎప్పుడో తరలించారు. ఈ విషయం తెలిసి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇసుక జోలికి నాయకులు ఎవరూ వెళ్లవద్దని ఆదేశించారు. స్వయంగా ముఖ్యమంత్రి ఆదేశించినా అధికారపార్టీ నేతల అక్రమాలు, దోపిడీ ఆగడం లేదు. గత ప్రభుత్వంలో వైసిపికి అనుకూలంగా వ్యవహరించిన నేతలు, ఇసుక మాఫియా ఇప్పుడు టిడిపిలో వచ్చి చేరిందనే విమర్శలున్నాయి. ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి వచ్చిన చెడ్డపేరు కన్నా ఈ ప్రభుత్వానికి ఎక్కువ చెడ్డపేరు వస్తుందని తెలుస్తోంది. టిడిపి అధినేతలు సైతం ఇసుక మాఫియా ఆగడాలు అరికట్టలేని స్థితికి చేరుకున్నారని సమాచారం.

బుకింగ్..సరఫరా అంతా వారే..!
ఇసుక ప్రస్తుతం సంగం, మినగల్లు, నెల్లూరు, పోతిరెడ్డిపాళెం, పల్లెపాడు ప్రాంతాల్లో ఇసుక నిల్వలున్నాయి. ఇక్కడ నుంచి ఇసుక కావాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలి. తరువాత క్రమ పద్ధతిలో క్యూలో వచ్చి లారీ, టిప్పర్లలో ఇసుక తీసుకెళ్లాలి. ఆన్‌లైన్ బుకింగ్ అంతా ఇసుక మాఫియా చేతిలోకి వెళ్లిందని తెలుస్తోంది. వారానికోసారి ఆన్‌లైన్ బుకింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. ఈ సమయంలో ఇసుక మాఫియా ఆధార్‌కార్డులు తీసుకొని బుకింగ్ చేసుకుంటున్నారు. సామాన్యులు కంప్యూటర్ సెంటర్‌లో కూర్చొని బుకింగ్ కావడం లేదు. మళ్లీ వారం వేచిచూడాల్సిందే. టన్ను రూ.350 చొప్పున ఒక ట్రాక్టర్‌కు 4.5 టన్నులు చొప్పున రూ.1750 అవుతోంది. రవాణా మరో వెయ్యి కలిపితే సుమారు మూడు వేల రూపాయలకు ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరాలి. ఇసుక మాఫియా బ్లాక్‌చేసి ట్రాక్టర్ రూ.5500 వరకు అమ్ముతున్నారని తెలుస్తోంది. టిప్పర్‌కు 20 నుంచి 24 టన్నుల వరకు లోడింగ్ చేస్తుండగా ప్రభుత్వానికి రూ.7 వేలు చెల్లించాలి. రవాణా మరో మూడు, నాలుగు వేల రూపాయలు అవుతోంది. బ్లాక్‌లో రూ.36 వేల వరకు అమ్ముతున్నారనే విమర్శలు వస్తున్నాయి.బుకింగ్ విషయంలోనూ, రవాణా విషయంలో వినియోగదారుల ప్రమేయం ఉండడం లేదు. ఇసుక మాఫియా బ్లాక్ చేసి, భారీగా దోపిడీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులకు తెలిసినా అధికారపార్టీ నేతల వత్తిడి, మాఫియాతో నోరు మెదపడం లేదు. ఇసుక గత ప్రభుత్వంలోనే బాగుందనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వం స్పందించకుంటే ఇసుక చెడ్డపేరు ప్రభుత్వానికి చుట్టుకుంటుందని తెలుస్తోంది.

సంగం వద్ద ఇసుక డంపింగ్ యార్డ్ నుంచి తరలిస్తున్న దృశ్యం

ట్రై సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరులో వరల్డ్ విజన్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చదువుకోవడానికి స్కూల్ దూరంగా ఉండి స్కూల్‌కు వెళ్లడానికి బస్సు సౌకర్యం లేక నడిచి వెళ్లి చదువుకునే 23 మంది బాలికలకు 16 మంది బాలురకు సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మునిసిపల్ కమిషనర్ అనూష, కందుకూరు ఎంఇఒలు సుబ్బారావు రెడ్డి ,అజయ్ బాబు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మునిసిపల్ కమిషనర్ అనూష మాట్లాడుతూ చదువుకునే పిల్లలకు వారి సౌకర్యా ర్థం వరల్డ్ విజన్ సంస్థ వారు సైకిళ్ళు పంపిణీ చేయడం హర్షించ దగ్గ విషయమన్నారు. ఎంఇఒ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వరల్డ్ విజన్ సంస్థ పేద విద్యార్థులకు గత కొన్ని సంవత్సరాలనుండి స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్,గైడ్స్ బరువు తక్కువ పిల్లలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వరల్డ్ విజన్ మేనేజర్ కె యేషయ ఉన్నారు.

బహుమతులు అందజేత

ప్రజాశక్తి -ఉలవపాడు : స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ 2047లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పోటీల్లో ఆవుల జాహ్నవి జిల్లా స్థాయిలెఒ నిర్వహించిన వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్.సలీం భాషా తెలిపారు. గ్రామ స్థాయి, మండల స్థాయి, రాష్ట్ర స్థాయిలో నెల్లూరు జిల్లాలో సోమవారం నిర్వహించిన "స్వర్ణాంధ్ర 2047 అంశం"పై నిర్వహించిన వృక్తత్వ పోటీలలో ఉలవపాడు మండలం పెద్ద పట్టపుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఆవుల జాహ్నవి తన ప్రతిభను చాటి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామస్తులు జాహ్నవిని అభినందించారు.

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులను నివారించాలి

❍ తొలగించిన కార్మికురాలును విధుల్లోకి తీసుకోవాలి

❍ ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి-నెల్లూరు
ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, తక్షణమే వాటి నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ర యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం ఆశా వర్కర్ అక్రమ తొలగింపును నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ఎపి ఆశా వర్కర్స్అండ్ హెల్ప్‌ర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశాలు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హాజరై మాట్లాడారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆశా కార్యకర్త పందిటి విజయలక్ష్మిని గ్రామ సర్పంచ్ అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా అధికారులపై ఒత్తిడి తెచ్చి తొలగించారన్నారు. సర్పంచ్‌కి అనుకూలమైన డ్వాక్రా మహిళలతో కొంత మందితో సంతకాలు చేయించి ఆశా కార్యకర్తను తొలగించేందుకు కుట్ర పన్నారన్నారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తొలగించిన ఆశా కార్యకర్త పందిటి విజయలక్ష్మి విధులు నిర్వహిస్తున్న సమయంలో రావులకొల్లు గ్రామ సర్పంచి వెంగప్పనాయుడు గతంలో వైసిపిలో ఉన్నారని, ప్రస్తుతం అధికార పార్టీ టిడిపిలోకి మారి ఆశా కార్యకర్తను వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. పందిటి విజయలక్ష్మిని తిరిగి విధుల్లోకి తీసుకొనే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.వి.ప్రసాద్, కె.అజయ్‌కుమార్, ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.విజయలక్ష్మి, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సిఐటియు కోశాధికారి కె.పెంచలనర్సయ్య ఉన్నారు.

మాట్లాడుతున్న కె. ధనలక్ష్మి

డిఎంహెచ్‌ఒ హామీ
కలిగిరి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్త పందిటి విజయలక్ష్మి తొలగింపునకు నిరసనగా ఎపి ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న ధర్నా శిబిరానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్య వచ్చారు. ఆశా కార్యకర్త పందిటి విజయలక్ష్మి పనితీరు బాగుందని తాను గుర్తించామని, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకునే చర్యలు తీసుకుంటామని ఆశా కార్యకర్తలకు, నాయకులుకు డిఎంఅండ్‌హెచ్‌ఓ హామీ ఇచ్చారు.

వంద రోజుల పాలన అస్తవ్యస్తం : కాంగ్రెస్

ప్రజాశక్తి-నెల్లూరు : బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పేర్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం 100 రోజుల మంచి పాలన అని మురిసిపోవడం సిగ్గుచేటని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి ఆక్షేపించారు. స్థానిక ఇందిరా భవన్‌లో డిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో చేవూరు మాట్లాడుతూ గత వంద రోజులుగా కక్ష సాధింపు ధోరణులు తప్ప తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు సిలిండర్ల ఉచితం, యువగళం, రైతుల పెట్టుబడి సహాయం కింద 20,000 రూపాయలు ఇస్తానన్న ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టిందని విమర్శించారు.రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను తెలుగుదేశం ప్రభుత్వం గద్దెనెక్కిన వెంటనే అమలు చేస్తామని చెప్పి, కనీసం సరిగ్గా సింగిల్ కూడా తీయలేని చంద్రబాబు మాయమాటలతో ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. షేక్ ఫయాజ్, ఏటూరి శ్రీనివాసుల రెడ్డి పిసిసి మెంబర్ బాల సుధాకర్, మోహన్ రెడ్డి ఎల్ సురేష్ మీడియా ఇంచార్జ్ కే .సంజయ్ కుమార్ అడ్వకేట్ మల్లి కిషోర్ రెడ్డి షేక్ హుస్సేన్ బాషా ఉన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రక్తదానం చేస్తున్న యువకులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు : భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన కనిపించింది. డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టరు బి.రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ లాంటి పోరాట యోధులు జయంతి సందర్భంగా డివైఎఫ్ఐ నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, రక్తదాన శిబిరాలు చేయడం హర్షణీయమన్నారు. ఈ రక్త దాన శిబిరంలో స్వచ్ఛందంగాయువత పాల్గొని 150 యూనిట్ల పైగా రక్త దానం చేయడాన్ని ఆయన అభినందించారు. . డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం.వి.రమణ, బి.పి నరసింహా లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగులకు భృతి కింద రూ.5 వేలు అందజేయాలన్నారు.ఇటీవల 6,7 డివిజన్ ప్రాంతాలకు కార్యదర్శిగా ఎన్నికైన కె.చెంగయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్దులకు ఈవెంట్స్ నిర్వహించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు .ఎస్ఎఫ్ఐ నాయకులు నరేంద్ర,చరణ్ డివైఎఫ్ఐ మాజీ నాయకులు కత్తి శ్రీనివాసులు, జి నాగేశ్వరరావు, పి సూర్యనారాయణ, నాగయ్య,నాగరాజు, డివైఎఫ్ఐ నాయకులు జగదీష్ శేఖర్ శశి రాజేష్ ఉన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని పెద్దపవని సెక్టార్ పరిధిలోని చిన్నపవని 1,2,3 అంగన్‌వాడీ కేంద్రాలలో ఉలవపాడు సిడిపిఒ అరుణ ఆదేశాల మేరకు పోషణ మహ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పెద్దపవని సెక్టార్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్రతి మహిళ వెంటనే అంగన్వాడీ కేంద్రాలలో పేరు నమోదు చేసుకోవాలని అంగన్వాడి కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనత నివారించడానికి ప్రతిరోజు క్యారెట్,బొప్పాయి, టమోటా,బీట్రూట్, ఆకుకూరలు, పాలు, గుడ్లు, కూర గాయలు తీసుకోవాలని వివరించారు. గర్భిణీలకు శ్రీమంతం,ఏడు నెలల పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. సెక్టర్ పరిధిలోని అంగనవాడి కార్యకర్తలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ఏఎన్ఎం,సచివాలయ సిబ్బంది,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిన్నపవనిలో..

కందుకూరు : 20వ వార్డు యానాది పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మహోత్సవం సోమవారం జరిగింది.కందుకూరు సిడిపిఒ శర్మిష్ట మాట్లాడుతూ పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా చిన్న పిల్లలు ,మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ లక్ష్మీ దేవమ్మ, అంగన్వాడీ కార్యకర్త బల్లిపల్లి పద్మావతితో పాటు బి సెక్టార్ అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులను ఆదుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి-కందుకూరు : జప్తులకు సిద్ధంగా చంద్రన్న మానస పుత్రికలు టిడ్కో ఇళ్ళు స్వాధీనం చేసుకుంటున్న బ్యాంకర్ల నుంచి లబ్ధిదారులని ఆదుకోవాలని సిపిఐ కందుకూరు నియోజకవర్గం కార్యదర్శి బి సురేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. రుణమాఫీ అవుతాయనే భ్రమలో ఉండి నిండా మునిగిన టిడ్కో గృహల లబ్దీదారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల రీ ఓపెన్ కేసుల పై ప్రత్యేక దష్టి పెట్టాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం పై జిల్లా అధికారులతో సమీక్ష చేసారు.అనంతరం ప్రజలనుండి అర్జీలు స్వీకరించి పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఆనంద్ సమీక్ష చేస్తూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 251 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయన్నారు. ప్రధానంగా రెవెన్యూ,పోలీస్, పంచాయతీ రాజ్ , సర్వే శాఖల్లో అర్జీలు రీ ఓపెన్ అవుతున్నా యన్నారు. రీ ఓపెన్ కేసులు తగ్గించేందుకు అధికారులు ప్రయత్నం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న, జిల్లా పరిషత్ సి.ఇ. ఓ ఖాదర్ వలి, జిల్లా పంచాయతీ అధికారి సుస్మితా రెడ్డి,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.గంగా భవాని, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ ఓ ఆనంద్

కార్పొరేషన్‌లో..
నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిం చారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. అదనపు కమిషనర్ శర్మద, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా ఉన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..
'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా బాధితుల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఎస్‌పి జి.కృష్ణకాంత్ సంబందిత పోలీసు అధికారులను ఆదేశించారని అడిషనల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య పేర్కొన్నారు. ఎస్. పి. ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నందు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడి యాతో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 105 ఫిర్యాదులు బాధితుల నుంచి స్వీకరిం చామన్నారు.అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్. సౌజన్య ,నగర డిఎస్‌పి డి..శ్రీనివాస రెడ్డి, రూరల్ డిఎస్‌పి జి. శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి , కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..

ర్యాలీ చేపట్టిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : కేంద్ర, రాష్ట్ర లు ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని జిల్లా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జెఎసి చైర్మన్ నరమాల సతీష్ కుమార్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం 'డిమాండ్స్ డే' కార్యక్రమాన్ని సిఐటియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నగరంలోని విఆర్‌సి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని నిరసన చేపట్టారు. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వారందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు రంగంలో ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ విధానంలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అందజేయాలని విద్యుత్తు ఉద్యోగుల కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ నాయకులు బి.సుమన్ పేర్కొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్, దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్తు కేంద్రం కాంట్రాక్టు కార్మికులు, జిజిహెచ్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

గుడ్లూరు పోలీస్‌స్టేషన్ దిగ్బంధనం

బాలుడి మృతదేహంతో రోడ్డుపై దళితుల బైఠాయింపు

ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-గుడ్లూరు : రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన అశోక చక్రవర్తి (13) మతికి కారణమైన ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ పై కేసు నమోదు చేసి తీవ్రంగా నష్టపోయిన బాధితు కుటుంబానికి న్యాయం చేయాలని గుడ్లూరు మండలం అడవిరాజుపాలెం ఎస్‌సి కాలనీకి చెందిన సుమారు 400 మంది గ్రామస్తులు గుడ్లూరు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి సోమవారం ఆందోళన చేపట్టారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా వందలాదిమంది బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు తెగిన బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం సోమవారం గుడ్లూరు పోలీస్ స్టేషన్ కి మహాప్రస్థానం ద్వారా తీసుకువచ్చారు. పోలీస్టేషన్ ఆవరణంలో ఉన్న వందలాది మంది గ్రామస్తులు న్యాయం జరిగే వరకూ బాలుడు మృతదేహాన్ని వాహనం నుంచి దించటానికి వీలేద ఆపేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఎస్సీ కాలనీలకు చెందినవారు గుడ్లూరు పోలీస్ స్టేషన్ దగ్గరికి చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కందుకూరు నుంచి అదనపు పోలీసు బలగాలు వచ్చాయి. కేసు నమోదు చేయకపోవడంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఆటో ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలు తగలగా ఒకే కుటుంబానికి చెందిన తల్లి, తండ్రి కుమారుడు కి గాయాలు తగిలి ఆస్పత్రిపాలయ్యారు. .గాయపడిన వారిలో కుమారుడు మరణించగా బాలుడు తండ్రి ఆరోగ్యం పరిస్థితి విషమంగా ఉండడంతో పరిస్థితిని ఇప్పటివరకు సమీక్షించకుండా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. . ట్రాక్టర్ యజమాని దగ్గర మామూలు తీసుకున్న పోలీసులు కేసును నీరు కారుస్తున్నారని ఎస్సీ కాలనీ గ్రామస్తులు ఆరోపించారు.

పోలీస్టేసన్ ఎదుట ఆందోళన చేస్తున్న దళితులు

గాయపడ్డ బాలుడు మృతి

గుడ్లూరు – అడవిరాజుపాలెం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు తెగి గాయపడిన 13 ఏళ్ల బాలుడు ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాలుడు తండ్రి జి పీటర్ ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు బాధితుల బంధువులు తెలిపారు. అడివి రాజుపాలెం ఎస్‌సి కాలనీకి చెందిన ఐదుగురు రామాయపట్నంలో విహారయాత్ర ముగించుకుని తిరిగి వస్తుండగా అడవి రాజుపాలెం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టరు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 13 ఏళ్ల చక్రవర్తి సోమవారం మతి చెందగా బాలుడు తండ్రి ఆరోగ్యం కూడా విషమంగా ఉన్నట్లు తెలియడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ ప్రమాదానికి కారణమైన డాక్టరు డ్రైవర్‌ను అదుపు లోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కె .అనూష

12 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పురపాలక సంఘ కార్యాలయములో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాధుల, డయల్ యువర్ కమీషనరు కార్యక్రమము ద్వారా 12 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమీషనరు కె. అనూష తెలిపారు.ఈ కార్యక్రమములో అందరు సెక్షన్ హెడ్స్ పాల్గొన్నారు. ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘ కార్యాలయము కమీషనర్ ఛాంబర్‌లో జరిగే ప్రజా పిర్యాధుల కార్యక్రమమును సద్వినియోగం చేసుకోవలసినదిగా మున్సిపల్ కమీషనరు కె. అనూష పట్టణ ప్రజలను కొరారు. పురపాలకసంఘ పారిశుధ్య వగైరా సమస్యలు కోసం కార్యాలయ నెం:9177700267 నకు ఫోన్ ద్వారా కూడా తెలియజేయవచ్చునని తెలిపారు.

న్యాయవాది రామకృష్ణ మృతి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, నోటరీ ధూళిపాళ్ళ రామకష్ణ (48) సోమవారం ఉదయం 10 గంటలకు తీవ్ర గుండెపోటుతో స్వగహంలో మరణించారు. రామకృష్ణ మరణం పట్ల కందుకూరు బార్ అసోషియేషన్, స్కంధపురి బ్రాహ్మణ సేవాసమితి, కందుకూరు నియోజకవర్గ బ్రాహ్మణ సమాఖ్య సంతాపం తెలిపాయి.

జెండా ఆవిష్కరణలు

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు శివాలయం దగ్గర ఉన్న కొప్పోలు చిరంజీవి ఫామ్ హౌస్ లో సిపిఎం శాఖ మహాసభ సీనియర్ నాయకులు మద్దిశెట్టి జాలయ్య అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభ సూచికంగా సిపిఎం పార్టీ జెండాను సీనియర్ సభ్యులు దామా కృష్ణయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు మహాసభను ప్రారంభిస్తూ ప్రారంభోపన్యాసం చేశారు. గుడ్లూరులో గిరిజనులు అధికంగా ఉంటారు కానీ వాళ్ళకు ఎక్కడ వేసిన గొంగళి లాగా ఉందని ఆదివాసి వృత్తం చేశారు. వీళ్లకు ఆధార్ కార్డులు లేవని, కుటుంబంలో ఎవరైనా చనిపోతే వాళ్లకు డెత్ సర్టిఫికెట్లు లేవన్నారు. అందువల్ల ప్రభుత్వ పథకాలకు అర్హత లేకుండా పోతుందన్నారు. అనంతరం సిపిఎం గుడ్లూరు జనరల్ శాఖ కార్యదర్శిగా జి.స్టాలిన్, ట్రేడ్ యూనియన్ శాఖ కార్యదర్శిగా కొట్టే వెంకయ్య ను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది. ఏ.వెంకటేశ్వర్లు, పి నాగేశ్వరరావు, ఎస్ విజయలక్ష్మి, కొమర గిరి అంజయ్య, ఎస్ తిరుపాల్, జే గోపాల్, పి రామసుబ్రమణ్యం, ఎస్కే ఖాదర్ బాషా, దాసరి సీతారాం, మాధవరావు, కోటమ్మ నారాయణమ్మ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

గుడిపాడులో సిపిఎం శాఖ సమావేశం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఎఎస్ పేట మండలంలోని గుడిపాడు గ్రామంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గంట లక్ష్మీపతి, ఏపి రైతుసంఘం మండల అధ్యక్షులు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సిపిఎం శాఖ మహాసభల్లో భాగంగా గుడిపాడులో శాఖ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టుపోయిన చిన్నయ్య, దేవరపాటి పెంచలయ్య, షేక్ మౌలా వేణు, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు డాక్టర్ ప్రణీత్ ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కరోనాలో తండ్రిని, తదనంతరం కొన్ని నెలలకే తల్లిని కోల్పోయిన అనాథలకు డాక్టర్ ప్రణీత్ ఆర్థిక సహకారం అందించారు. వివరాల్లోకెళితే ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అంకయ్య మాను వద్ద తల్లిదండ్రులను కోల్పోయిన శీలా గౌరీదేవి, శీలా శాశీ విశ్వనాథం నివాసమున్నారు. స్థానిక ప్రోత్సాహంతో వారి చదువులను కొనసాగిస్తున్నారు. స్థానిక సమాచారంతో వారి పరిస్థితిని తెలుసుకున్న డాక్టర్ ప్రణీత్ వారిని ప్రోత్సహించే ఉద్దేశంతో సోమవారం విజయం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేసి వారిని ప్రోత్సహించారు. భవిష్యత్తులో ఏమైనా అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని, అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, చోటు, యాసిన్, చాణిక్య తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-సంగం : సంగం జెడ్పి హై స్కూల్లో లైబ్రరీ అసిస్టెంట్ వెంకట సుబ్బయ్య ఉద్యోగ విరమణ వేడుకలను ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒ మల్లయ్య, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఆయన పాఠశాలలో చేసిన సేవలు గురించి వారు కొనియాడారు. ఈ సేవల్లో లైబ్రరీ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య తన ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలకు తన వంతుగా చేయూతనిచ్చారు. 500 మంది విద్యార్థులకు లక్ష రూపాయల విలువైన స్టీల్ వాటర్ బాటిల్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అందరూ వెంకటసుబ్బయ్యకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అనంతరం వెంకటసుబ్బయ్యను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎంగా మల్లికార్జున రెడ్డి, లక్ష్మీకాంతం, మాల్యాద్రి, విద్యా కమిటీ చైర్మన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని వెన్నవాడ ఎంపిపి పాఠశాలలో సోమవారం వీరగాథ 4.0 ప్రాజెక్టులో భాగంగా చిన్నారుల స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో అలరించారు. పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న కథాలెక్టికి నైనిక రూపన్నీ లక్ష్మీబాయి వేషధారణలో, 5వ తరగతి చదువుతున్న కె.భార్గవ్ అల్లూరి సీతారామరాజు వేషధారణలో చక్కని అభినయం ప్రదర్శించారు. ఇలాంటి సైనిక వీర గాథలను విద్యార్థులలో రాయింది రికార్డు చేసేందుకు వీరగాథ ప్రాజెక్టును కేంద్రం నిర్వహిస్తుందని ప్రధానోపాధ్యాయులు కలిశెట్టి రవిచంద్రబాబు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఎస్ఎంసి చైర్మన్ కె.లావణ్య, ఉపాధ్యాయులు విజయ అభినందించారు.

నేడు చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-కావలి : కావలి జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు తన కార్యాలయంలో మాట్లాడుతూ జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు-2024లో భాగంగా మంగళవారం ఉదయం 9 గంటల నుండి కావలి పట్టణంలోని రెడ్ క్రాస్ భవనం (ఆర్డిఒ ఆఫీస్ వెనుక)లో పట్టణ స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ మొదలవుతుందని తెలియజేశారు. దాదాపు 40 ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్ల నుండి ముగ్గురు విద్యార్థుల చొప్పున 120మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. పట్టణస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను 27వ తేదీన జరుగబోవు జిల్లా టాలెంట్ టెస్ట్కి ఎంపిక చేస్తామన్నారు.

'శ్రీ చైతన్య' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కావలి : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కావలి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలియజేశారు. నెల్లూరులోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన ఎస్.జి.ఎఫ్. జిల్లాస్థాయి అండర్ -19 అథ్లెటిక్స్ సెలక్షన్లో ఎం.నవదీప్ 'హేమర్ త్రో' లో ప్రథమ స్థానం, 'షాట్ పుట్'లో ద్వితీయస్థానం, ఎం.హేమంత్ పోల్వాల్ట్లో ప్రథమస్థానం 'హేమర్ త్రో'లో ద్వితీయస్థానం అండర్-17 విభాగంలో కె.లోకేష్, 400 మీటర్ల హర్డిల్స్ ప్రథమ స్థానం కె.చరణ్ 'హేమర్ త్రో'లో ప్రథమ స్థానం, కె.రాజేష్ డిస్కస్ త్రో ప్రథమ స్థానం, కె.శివమణి ట్రిపుల్ జంప్లో ద్వితీయ స్థానం ఎవి.రాజేంద్ర పోల్ వాల్ట్ లో ప్రథమ స్థానం, బాలికల విభాగంలో సి.హెచ్.లక్ష్మి ప్రియా హేమర్ త్రో'లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన రామయపట్నం ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.జీవన్కుమార్ను ప్రత్యేకంగా కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎవి.వెంకయ్య, కళాశాల డైరెక్టర్ ఎం.కొండయ్య, పివిఎస్.ప్రసాద్, ఓ.మల్లికార్జున రావు, కళాశాల గౌరవ సలహాదారు నందవరపు మధుసూదన్ రావు, ప్రిన్సిపాల్ టివి లుక్ తర్, పిడి కె.వెంకటేశ్వర్లు విద్యార్థులను అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం పాతూరు లోని అంగన్ వాడీ కేంద్రంలో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, అంగన్వాడీలు రమణమ్మ, జ్యోతి, సర్తాజ్, మహిళా సంరక్షణ కార్యదర్శి పవనకుమారి తదితరులున్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని రామాపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. మహిళ పోలీసు వై.సురేఖ, ఎఎన్ఎం వై.సుమతి, వెల్ఫేర్ అసిస్టెంట్ టి శ్రావణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి.నాగదివ్యశ్రీ, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరికి ప్రాధాన్యత కల్పించండి

ఆర్డబ్ల్యుఎస్ శాఖ అధికారులతో ఉదయగిరి ఎంఎల్ఎ కాకర్ల సమీక్ష

ప్రజాశక్తి -వరికుంటపాడు

ఉదయగిరి నియోజకవర్గానికి మొదటి ప్రాధాన్యతినిస్తూ 143 పంచాయతీల్లో తాగు నీటిఎద్దడి లేకుండా పని చేయాలని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆర్డబ్ల్యుఎస్ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం నెల్లూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆర్డబ్ల్యుఎస్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి ఎన్టిఆర్ సృజల స్రవంతి పథకాల గురించి వివరాలు సేకరించారు. అనంతరం ఎంఎల్ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ జలసిరి ద్వారా నియోజకవర్గంలో రైతులకు అత్యధిక బోర్లు వేసేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఎన్టిఆర్ సృజల స్రవంతి ద్వారా అవసరమైన పంచాయతీల్లో మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. క్లోరిన్ రహిత నియోజకవర్గంగా ఉదయగిరిని రూపుదిద్దేలా కృషి చేయాలని తెలిపారు. మూగజీవాల కోసం అవసరమైన చోట్ల బోర్లు వేసి చేతిపంపులు అమర్చాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో మంజూరై అసంతృప్తిగా మిగిలిపోయి ఉన్న 8 మండలాల్లో ఉన్న మదర్ ప్లాంట్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. తదితర అంశాలపై ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆర్డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ ఇఇ రాధయ్య, వింజమూరు డిఇఇ బి.భావనారాయణ, కలిగిరి ఎఇఇ ఎస్.కె మషోద్ అహ్మద్, జలదంకి ఎఇఇ ఎ.సతీష్ బాబు, కొండాపురం ఎఇఇ ఎస్.కె.జిలాని భాషా, దుత్తలూరు ఎఇఇ టి.హరిత, వింజమూర్ ఎఇ కె.వరప్రసాద్, వరికుంటపాడు ఎఇ ఆర్.హనీనిశి, ఎస్ఆర్ పురం ఎఇ పి.జగన్నాథం తదితరులున్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

4న ఉచిత ఇసుక కోసం ధర్నా

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

గృహ నిర్మాణదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వాలని 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికులకు రోజుల తరబడి పనులు దొరక్క కుటుంబ సభ్యులు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలా కూటమి ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గృహ నిర్మాణదారులు అందరికీ ఉచిత ఇసుకను అందజేసి వారి జీవనోపాధికి తోడ్పడాలన్నారు. అధికార పార్టీ నాయకులు రాత్రులు ఇసుకను తరలిస్తున్నారు. ఈ తరలింపులో వారి మధ్య వచ్చిన గొడవలు పోలీసు కేసులు కూడా నమోద య్యాయి. సామాన్య ప్రజలకు ఉచిత ఇసుక అందించాలని 4న రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు జరగనున్నాయి. బుచ్చిరెడ్డిపాళెం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకి మండలంలోని గృహ నిర్మాణదారులు, భవన నిర్మాణ కార్మికులు, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న చల్లకొలుసు మల్లికార్జున

టిడిపి కన్వీనర్ 'చంద్ర' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వరికుంటపాడు : టిడిపి మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా పామూరు మండలంలోని ఆయన నివాసంలో టిడిపి, జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలబొకే, మిఠాయిలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జెడ్పిటిసి రావెళ్ల నాగేంద్ర, వైస్ ఎంపిపి దేవానబోయిన మధు, తెలుగు యువత ముజ్జె లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, బిసి సెల్ అధ్యక్షులు కొండల యాదవ్, ఎస్సి సెల్ అధ్యక్షులు లాభాన్, నూనె ప్రసాద్, ఆరోన్, సుకుమార్, మండల జనసేన అధ్యక్షులు రసూల్, విజయభాస్కర్ రెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, నర్సయ్య, జానీ, వెంకట రత్నం, వెంకీ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఛార్జి ఎంపిడిఒ బదిలీ

ప్రజాశక్తి - వరికుంటపాడు : వరికుంటపాడు ఇన్ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున సాధారణ బదిలీలో భాగంగా దుత్తలూరు ఇఒపిఆర్డిగా సోమవారం బదిలీపై వెళ్లారు. ఆయన ఉదయగిరి ఇఒపిఆర్డిగా ఉంటూ వరికుంటపాడు ఇన్ఛార్జి ఎంపిడిఒగా వ్యవహరిస్తున్నారు. అలాగే కోవూరు నుంచి ఖాదర్వల్లీ వరికుంటపాడుకు ఇఒపిఆర్డిగా నియమితులయ్యారు. ఆ మేరకు కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి.

పి.వి.క్రిష్ణయ్యకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆర్టిసిలో ఎడిసిగా గత 35యేళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్న పి వి క్రిష్ణయ్యను సోమవారం ఉదయగిరి డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ – ఉదయగిరి డిపో సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మిత్రులు సహోదరులు మాట్లాడుతూ పి.వి క్రిష్ణయ్య ఎడిసిగా గత 35యేళ్ల నుండి యూనియన్కు నిబద్ధతతో పనిచేస్తూ కార్మికుల శ్రేయస్సు కోసం పాటు పడిన వ్యక్తి క్రిష్ణయ్య అని కొనియాడారు. వారి శేష జీవితం ఆరోగ్యంగా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్దాని, అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రవి, సుదర్శన్, పలువురు, నాయకులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన పాలవల్లి

ప్రజాశక్తి-జలదంకి : వైసిపి జిల్లా కన్వీనర్గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని సోమవారం జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన వైసిపి మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండా రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కాకాని స్వగృహంలో పాలవల్లి ఆయనను అభినందించారు. దుశ్శాలువాతో కాకాణిని సత్కరించి పూలబొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు ఇరువురు పార్టీ విషయాలపై చర్చించుకున్నారు. పార్టీ పటిష్టతకు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి పాలవల్లికి మాజీ మంత్రి సూచనలు చేశారు.

ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి-అనంతసాగరం : ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులోని మట్టిని తరలిస్తున్న 11ట్రాక్టర్లను సోమశిల ఎస్ఐ పి.అనూష సీజ్ చేసి స్టేషన్కు తరలించారు. మండలంలోని పడమటి కంభంపాడు నల్లచెరువులో మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో చేరువులోనికి వెళ్లి ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. పై అధికారులకు సమాచారం ఇచ్చి మోటార్ వాహనాల అధికారులకు అప్పగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

రిజర్వేషన్ కౌంటర్ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : రైల్వే స్టేషన్లో ఉన్న రిజర్వేషన్ కౌంటర్ను తిరిగి పునరుద్ధరించాలని బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు పేర్కొన్నారు. బిట్రగుంట సంగ్ చైర్మన్ గోవిందరాజులు పదవి విరమణ సందర్భంగా రైల్వే ఇన్స్టిట్యూట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విజయవాడ డివిజనల్ సంగ్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వర్లు, బిట్రగుంట బ్రాంచి సంగ్ సెక్రటరీ రాజశేఖర్ పాల్గొనగా బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు, ఫౌండర్ అధ్యక్షులు కుందుర్తి శ్రీనివా సులు, ట్రెజరర్ పి.జీవన్ కుమార్, సెక్రటరీ జిలాని, సుబ్బారావు వారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులున్నారు.

గోవిందరాజులను సన్మానిస్తున్న సభ్యులు

ఆర్టిసి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు ఆర్టిసి డిపోను లాభాల బాటలో నడుపుతూ అభివృద్ధి దిశగా పయనింపచేసేందుకు అందరూ కృషి చేయాలని ఎపిఎస్ ఆర్టిసి గుంటూరుజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వారు ఆత్మకూరు ఆర్టిసి డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆర్టిసి మెయిన్ బస్టాండ్తో పాటు మున్సిపల్ బస్టాండ్ను పరిశీలించారు. అనంతరం గ్యారేజ్, ట్రాఫిక్, ఆర్టిసి కార్గోను తనిఖీ చేశారు. బస్సుల కండిషన్ను పరిశీలించారు. ఆత్మకూరు డిపో పరిధిలోని ఆదర్శ ఉద్యోగులను అభినందించారు. తదుపరి డిపో ఆవరణంలో వారు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆర్టిసి డిపో మేనేజర్ కరిమున్నిసా, యూనియన్ నాయకులు, ఆర్టిసి అధికారులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న గిడుగు వెంకటేశ్వరరావు

దసరాకు రాజకీయ భవిష్యత్తును ప్రకటిస్తా..

ప్రజాశక్తి-కావలి : రానున్న విజయదశమి పండుగ నాడు తన భవిష్యత్తు రాజకీయాలను ప్రకటిస్తానని మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్, మాజీ జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి మన్నెమాల సుకుమార్రెడ్డి ప్రకటించారు. ఆదివారం నిర్వహించిన ప్రెస్మీట్లో మాట్లాడుతూ తనను వాడుకుని, ఇప్పుడు పాత విషయాలు బయట పెట్టి, తనను ఇబ్బంది పెట్టాలని ఓ మాజీ ప్రజాప్రతినిధి కుట్రలు చేస్తున్నారని తెలిపారు. తనను చూసి ఓర్వలేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, త్వరలో తన రాజకీయాలను ప్రకటిస్తానని తెలిపారు. ఒకప్పుడు వైసిపిలో రామలక్ష్మణులుగా సదరుప్రజా ప్రతినిధిని, తనను పిలిచేవారని, అవతలి వ్యక్తి తన పనులన్నీ తన ద్వారా జరిపించుకుని, ఇప్పుడు కరివేపాకు చందంగా వదిలించుకోవడమే గాక, బాగా బతుకుతున్న వారిని కూడా ఇబ్బంది పెట్టనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో కలిసే ఇష్టం లేకున్నా ఎన్నో పనులు చేశామని, అవన్నీ తానే చేశానని ఆ ప్రజాప్రతినిధి జనాలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. ప్రజలు ఓట్లు వేసి, గెలిపించేది, వాళ్లకేదో పనులుచేస్తామని, అంతేగాని వీలు కుదిరింది కదా అని ప్రజలను, ప్రభుత్వ ఆస్తులను దోచుకోవడానికి కాదు కదా అన్నారు. ఆ విషయం తాను చెప్పబోతే, ఆయన అవినీతి పనులన్నీ, తాను చేశానంటూ తనను దూరం పెట్టారని వాపోయారు. ఇప్పుడు కావలి ఎంఎల్ఎ గెలిచిన నాటినుంచి నీతి, నిజాయితీలకు ప్రతిరూపంగా, ప్రజల నోట్లో నాలుక గా, అభివృద్ధి పనులకు చిరునామాగా, ప్రజలకు ఎన్నో సేవలు చేస్తున్నారని కొనియాడారు. త్వరలో తన అనుచరులతో చర్చించుకుని విజయ దశమికి తన రాజకీయ భవితవ్యం ప్రకటిస్తా న్నారు. అప్పుడు అవినీతి పరులైన రాజకీయ నాయకులకు చెక్ పెట్టబోతున్నానని సుకుమార్ రెడ్డి వెల్లడించారు.

మాట్లాడుతున్న మన్నెమాల సుకుమార్రెడ్డి

స్కూల్లో కుళాయిలు ఏర్పాటు

ప్రజాశక్తి - కావలి : వైకుంఠపురం 35వ వార్డులోని ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్న 129 పిల్లలకు వాటర్ ఫిల్టర్, కొళాయిలు వినియోగంలో లేని కారణంగా తాగునీరు సమస్య ఉందని తెలుసుకుని వార్డు టిడిపి నాయకులు మల్లి రాము మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, వార్డ్ ఇన్ఛార్జి తుళ్లూరు శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ కొమర రమణయ్య, తాత గోపి, ఉప్పాల సుధా, మళ్లీ శ్రీనివాసులు, బండ్ల తిరుపతి, మనోహర్ చౌదరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డిఇఇ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్గా ఏడుకొండలు సోమవారం కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాపూరు పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో డిఇఇగా పనిచేస్తున్న ఏడుకొండలు ఆత్మకూరు సబ్ డివిజన్కు బదిలీ అయ్యారు.

మధుకు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణానికి చెందిన గ్రామీణ వైద్యులు, ఆపద్బాందవ సేవా ట్రస్ట్ చైర్మన్ దామ మధుసూదన రావుకు ఆదివారం గుంటూరులోని సిపిఎం ఆఫీస్ హాల్లో అమ్మవాడి చారిటబుల్ ట్రస్ట్ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఎపి హౌసింగ్ కార్పొరేషన్ విఠల్ కుమార్ సమక్షంలో జాతీయ విశిష్ట సేవారత్న పురస్కారం అందుకున్నారు. అవార్డు గ్రహీత దామ మధుసూదనరావు మాట్లాడుతూ విశిష్ట సేవారత్న అవార్డుకు తనను ఎంపిక చేసిన అమ్మవాడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు రావడానికి ముఖ్య కారణం నిరంతరం తాను ప్రతిరోజు నిరు పేదలకు, మతిస్థిమితం లేనివారికి, నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్నందుకు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నందుకు వచ్చిందని తెలిపారు.

నరసాపురం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

మండలంలోని నరసాపురం ఎంవిఆర్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎన్నికయ్యారు. స్కూల్ గేమ్స్ సమాఖ్య నెల్లూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్లో నరసాపురం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చూపి నెల్లూరు జిల్లా విజేతగా నిలిచారు. అండర్-17 అమ్మాయిల విభాగంలో పి.ఇందు, పి.అమూల్య, అండర్-14 అమ్మాయిల విభాగంలో పి.జ్యోతి, శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుండి పాల్గొంటారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజయం సాధించి పాటశాలకు మంచిపేరు తీసుకు రావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వరరావు కోరారు. వారి వెంట వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎపి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రాజగోపాల అచార్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్కుమార్ పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గత రెండు, మూడు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులకు మోక్షం కలిగి ఉండాలని కోరుతున్నామన్నారు. కనీసం ఆ బిల్లులు రద్దు చేయాలని కోరినా తిరస్కరించారన్నారు. 2023 జూలైతో ముగిసిన 11వ పిఆర్సి స్థానంలో 12వ పిఆర్సి కోసం కమిటీ ఏర్పాటు చేశారని, ఐఆర్ పరిస్థితి మాత్రం ప్రస్తావించలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి రావాల్సిన చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం అట్టహాసంగా మొదలుపెట్టిన హైస్కూల్ ప్లస్లలో విద్యార్థులు లేక అనేక పాఠశాలలు మూతపడ్డాయని, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 250 హైస్కూల్ ప్లస్ పాఠశాలలని కొనసాగిస్తున్నరాని, అయితే ఉపాధ్యాయుల నియామకాలు లేక ప్రధానోపాధ్యాయులే బోధన చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ విషయమై ఆలోచించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఉద్యోగుల్లో ఆందోళన తీవ్రతరమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉదయగిరి : పిఎం విశ్వకర్మ బ్రిక్ మేషన్ బేసిక్ శిక్షణా తరగతులు ప్రారంభమైనట్లు ఎన్ఎసి ఎస్పిఐసి లక్కినేని ప్రకాష్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఉదయగిరి పిఎం విశ్వకర్మ ఆరు రోజుల ఉచిత శిక్షణ జరుగుతుందన్నారు. బేసిక్ టూల్కిట్ ఉపయోగం హ్యాండ్ బుక్స్ అందజేశా మన్నారు. కార్యక్రమంలో సర్టిఫైడ్ ట్రైనర్ శ్రీతాని సూరిబాబు, ఎన్ఎసి ఎస్పిఐసి లక్కినేని ప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గుంజి లతిక 65కేజీల విభాగంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎపికైనట్లు జెడ్పిహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని గంజి లతికను సోమవారం ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, పిడి ఉపాధ్యాయురాలు వి.రేణును పాఠశాలల్లో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు గంగాధర్ మాట్లాడుతూ మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయ న్నారు. జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుండి జిల్లాస్థాయికి 400 మీటర్ రన్నింగ్కు పి భార్గవి, డిస్కత్రో బాల్కు బి ఆలీషా, ఖోఖో బి.భువనేశ్వరి, వాలీబాల్ ఆటకు పి, పావని, 600 మీటర్ రన్నింగ్ కు ఎస్కె జాకీరాలు, యోగాకు ఎస్తేరు రాణి, నిషిత ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

In the Court of the III Addl. District Judge : Nellore
E.P.No. 935 / 2022
Arbitration Case No. 488 / 2021
M/s. Shriram City Union Finance Ltd., having its Branch Office at Kavali, Rep. by its GPA. Sri **K Phani Kumar**
... Award - Holder
Vs
1. **Bhagyalakshmi Areti**
2. **Areti Srinivasulu**
3. **Areti Venkata Krishnaiah** ... J.Drs

వేలం ప్రకటన

పై నెంబరున అవార్డు హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు 2వ జెడిఆర్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే03-10-2024** దిన **ఉదయం 10.30 గంటల** నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore District, Kavali Registration District, Kavali Sub- Registration District, Kavali Mandal, Musunuru Grama Panchayath, western side to Railway Track Musunuru Village Patta No.100, Sy No.840/1-1 an extent of Ac. 2.50 cents and in Sy.No.827/2 an extent of 2.27 cents total an extent of Ac 4.77 Cents of land laid out into plots, Plot No.47 admeasuring to an extent of 30 ankanams or 240 Sq yds of vacant site **bounded by : East :** Plot No.52, 40.3 ft, **West :** Road 39.9 ft, **North:** Plot No.46, 54.0 ft, **South:** Plot No.48, 54.0 ft, Within these an extent of 30 ankanams or 240 sq.yds of vacant site with all easementary rights and appurtenant therein
DHR Value of **Rs.27,00,000 /-**
Field Assistant Value of **Rs.24,00,000 /-**
Market Value of **Rs.13,20,000 /-**

Sk.Abdul Samath, B.Com., B.L.,
అవార్డు హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In The Court of the III Addl. District Judge : Nellore.
E.P. No. 64 / 2023
Arbitration Case No. 2/2022
M/s. Shriram City Union Finance Ltd., Branch Office at Nellore-2. Rep.by its GPA. Sri **A.Ramana Reddy**
- Award-Holder
Vs
1. **Mallavarupu Venu Gopal**
2. **M.Padmavathi**
3. **M.Prasad** - J.Drs

వేలం ప్రకటన

పై నెంబరున అవార్డు హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు 1వ జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే15-10-2024**దిన **ఉదయం 10.30 గంటల** నుండి **సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాట దారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాటపాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore District,Nellore Registration District, Kovur Sub-Registration District Kovur Mandal, Padugupadu Grama Panchayati, Padugupadu Village, Sy.No. 241/1,242/1,Ward No.1, Inamadugu Road, near to D.No.1-470, Out of 33.25 Ankanams and in it Northern Side 16.25 ankanams of vacant land bounded on: (This site Comprision Survey No.242/1C) **East :** Road, **West :** Land of M.Prasad, **North :** Land of Giddaluru Lakshmi Kanthamma, **South :** Property of M.Prasad, Within this 16.25 ankanamas or 130 sq.yds of Vacant Land with all easementary rights and appurtenant therein.

DHR Value of Rs.35,00,000/-
Field Assistant Value of Rs.35,00,000/-
Market Value of Rs.4,94,000/-

వి.జయరామారావు, బి.ఎ., బి.ఎల్.,
అవార్డు హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

ఓల్టా చట్టానికి తూట్లు..

- ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేత
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి-వరికుంటపాడు : ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా వేప, రావి లాంటి భారీ వృక్షాలు నరికి ఓల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఓల్టా చట్టం ప్రకారం ఇంట్లో పెంచుకున్న చెట్టు అయినా సరే అటవీ శాఖ నుండి సంబంధిత అధికారుల నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలి. వ్యవసాయ పొలాల్లో కలప అయితే అటవీ అధికారులతో పాటు స్థానిక రెవెన్యూ అధికారుల డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలి. ఐదు మొక్కలు నాటి ఐదు బతికిన తర్వాత భారీ వృక్షాన్ని కత్తిరించాలి. ఇవేమీ లేకుండా ఆదాయమే పరమావధిగా ఇష్టారాజ్యంగా చెట్లు నరికి వేస్తున్న క్షేత్రస్థాయి అటవీశాఖ సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతూ వారికి అండగా నిలబడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్నడూ లేని విధంగా నిత్యం పదుల సంఖ్యలో లారీలతో కలప తరలిపోతూ ఉంది. కళ్ల ముందు లారీలు కలపను మోసుకు వెళుతున్నప్పటికీ కనీసం అటవీశాఖ అధికారులు ప్రశ్నించే చొరవ కూడా చూడటం లేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏపాటిదో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల ప్రపంచ పర్యావరణ సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం భారతదేశంలో సగటు ఒక మనిషికి ఎనిమిది చెట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తేల్చి చెప్పింది. మానవాళి విపత్తుకు లోనవుతుందని తెలిసినప్పటికీ ప్రకృతి సంపదను కాపాడాల్సిన అధికార యంత్రాంగం ప్రలోభాలకు లోబడి ప్రకృతి విధ్వంసానికి సహకరిస్తున్నారంటూ స్థానికంగా ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తరలిపోయే కర్రకు సంబంధించి ఎక్కడ అనుమతులు తీసుకున్నారు.. ఎక్కడ నరుకుతున్నారు.. ఎవరు ఎవరెవరికి చలానాలు వేశారు.. అని వివరాలు ఏమాత్రం తెలియడం లేదని పలువురు అంటున్నారు. కలప తరలింపు విషయంపై అందుబాటులో ఉన్న బీట్ అధికారులను వివరణ కోరితే తాము చలానా రాశాము పంపిస్తున్నామని చెప్తున్నారని, చలానాలు రాస్తే ప్రకృతి యుద్ధం ఆగిపోతుందా అంటూ ప్రజల ప్రశ్నిస్తున్నారు. ఈ తతంగంపై జిల్లా ఉన్నత అధికారులు దృష్టి సారించాలని అసలు ఓల్టా చట్టం అమలులో ఉందా.. లేదా.. తెలియాల్సిన అవసరం కూడా తమకు ఉందని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తరలిపోతున్న భారీ వృక్షాల కలప

దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో పలు దేవాలయాల్లో హుండిలను, దేవాలయాల్లో అభరణాలు చోరి చేసిన దొంగలను అరెస్ట్ చేసినట్లు ఆత్మకూరు డిఎస్పి కె.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం డిఎస్పి కార్యాలయంలో దొంగలను, రికవరీ చేసిన సొత్తుతో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలి పనుల్లో స్నేహం కుదిరిన నలుగురు వ్యక్తులు జల్సాలకు అలవాటు పడి దేవాలయాల్లో అభరణాలు, హుండిలో నగదు చోరీలకు పాల్పడుతున్నారని, ఆదివారం అనంతసాగరం మండలం లింగంగుంట వద్ద వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దొంగతనానికి పాల్పడిన వారిలో అనంతసాగరం మండల పాతదేవరాయపల్లికి చెందిన మానికల చెంచయ్య, చేజర్ల మండలం మాముడూరుకు చెందిన పోటూరు రమణయ్య, నాగులవెల్లటూరుకు చెందిన యాటగిరి కస్తూరయ్య, మండలంలోని కరటంపాడుకు చెందిన పొట్లూరు పెంచలయ్యలుగా గుర్తించామని, వారిని అదుపులోకి తీసుకుని విచారించంగా, వీరు పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడిన విషయం తెలిసిందని, వారి వద్ద నుండి సొత్తు రికవరీ చేసినట్లు వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్లు తెలిపారు. దొంగలను పట్టుకునేందుకు ప్రతిభ చూపిన సిఐ గంగాధర్ రావు, అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాష్ రెడ్డిలతో పాటు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న డిఎస్పి వేణుగోపాల్

మాట్లాడుతున్న డాక్టర్ రాంకుమాం

'నారాయణ'లో గుండె వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రపంచ గుండె వ్యాధుల దినోత్సవం సందర్భంగా నారాయణ హాస్పిటల్ కార్డియాలజి విభాగం ఆధ్వర్యంలో స్థానిక జెసి భవన్లో జె.ఎ.సి సభ్యులకు గుండె వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ , డివైస్ స్పెషలిస్ట్ డాక్టర్ రాంకుమార్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం ఈ రోజుని వరల్డ్ హార్ట్ డేగా జరుపుకుంటుందన్నారు. గుండె యొక్క ప్రాముఖ్యతను గుర్తుంచుకునేందుకు, గుండె వ్యాధులు రాకుండా ఎటువంటి ముందు జాగ్రత్తలు పాటించాలి, ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి అనే దానిపై అవగాహన పెంచుకునేందకు వరల్డ్ హార్ట్ డే నిర్వహి స్తారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రివెంటివ్ హెల్త్ చెక్ ద్వారా గుండె జబ్బుల భారిన పడకుండా జాగ్రత్తపడలన్నారు. గుండె జబ్బులతోపాటు, గుండె లయ యొక్క అసమానతలను సరిచేయడంలో ఆధునిక చికిత్సా విధానం ఎలక్ట్రోఫిజియాలజిలో ప్రత్యేక నైపుణ్యత అందుకు అవసరమైన సౌకర్యాలు, సిబ్బందితో కూడిన ప్రత్యేక విభాగం నారాయణ హాస్పిటల్లో మాత్రమే అందుబాటులో ఉంద న్నారు. పదేపదే గుండె దడ, తలతిరగడం, గుండెకు స్టంట్ వేయించుకున్న తరువాత గుండె పనితీరు తక్కువగా ఉన్నవారు నారాయణ కార్డియాలజి విభాగం లోని ఎలక్ట్రోఫిజియాలజి సేవలను పొందచ్చన్నారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, సీనీయర్ కన్సల్టెంట్ డాక్టరు కె. తిలక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గుండె వ్యాధులను ఎలా గుర్తించాలి, ఆహారపు అలవాట్లు గురించి, వ్యాయామం, తీవ్రమైన ఒత్తిడి కారణంగా గుండె వ్యాధులు తదితర అంశాలపై వివరించారు. జెఏసి రీజనల్ ఛైర్మన్ చలువాది శరణ్ కుమార్ మాట్లాడుతూ వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నారాయణ హాస్పిటల్ గుండె వైద్యులు జె.ఎ.సి సభ్యులకు అవగాహన కల్పించేందకు రావడం సంతోషంగా ఉందన్నారు. ధూమపానం, మద్యపానం అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఖరీదైన పన్నెండు వేలు ఖరీదు చేసే వైద్య పరీక్షలను నారాయణ హాస్పిటల్ వారు కేవలం రూ 3 వేలకు మాస్టర్ హెల్త్ చెకప్ రూపంలో అందిస్తున్నామన్నారు. ఈ చెకప్ జె.ఎ.సి సభ్యులందరికీ చేయించేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. జె.ఎ.సి అసోసియేషన్ సభ్యులకే కాకుండా వారి కుటుంబాలకు మిగతా అసోసియేషన్లకు రాయితీతో కూడిన ఒక ప్రత్యేక హెల్త్ కార్డును అందించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని కోరుకుంటున్నట్లు తెలిపారు. తమ విలువైన సమయాన్ని కేటాయించి జె.ఎ.సి సభ్యులకు ఉన్న అపోహలను, సందేహాలను నివత్తి చేసినందుకు గుండె వైద్యులకు కతజ్ఞతలు తెలిపారు. నారాయణ హాస్పిటల్ డిప్యూటి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు అరుణ్కాంత్, ఏజీఎం శేఖర్ రెడ్డి, జె.ఎ.సి నేషనల్ డైరెక్టర్ కె. సత్యనారాయణ, జె.ఎ.సి జోన్ ట్రెజరర్ పి.వి సత్య నారాయణ, జెఏసి జోన్ డైరెక్టర్ సిహెచ్ మధుబాబు, జెఏసి సభ్యులు పాల్గొన్నారు.

సౌరశక్తితో కాలుష్యం తగ్గుదల

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సౌర (సోలార్) శక్తిని ఉపయోగించడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని కొంతమేరకు తగ్గించవచ్చని టీడీపీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవ ర్గం శాసనసభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనల మేరకు ఎస్.ఇ.ఐ.ఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ తోటపల్లిగూడూరు మండలం, వరకవిపూడి గ్రామ పంచాయతీకి సోలార్ విద్యుత్ లైట్లను మంజూరు చేసింది. సోమవారం సోలార్ విద్యుత్ లైట్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భం గా సురేష్ రెడ్డి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఎనర్జీతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. సౌరశక్తి అనేది పునరుత్పాదక, తరగని, సరసమైన శ క్తి రూపమని పేర్కొన్నారు. సోలార్లో రెండు రకాల సౌర పరికరాలు ఉన్నాయన్నారు. సౌరశక్తిని ఉపయోగించడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని కొంత మేర తగ్గించవచ్చని తెలిపారు. తక్కువ ఖర్చుతో కూడుకున్న సోలార్ లైట్లు ఉపయోగం తో విద్యుత్ బిల్లులను 90 శాతం వరకు తగ్గించవచ్చని చెప్పారు. సూర్యరశ్మి ఎక్కువగా వచ్చే ప్రదేశాల లో, సౌరశక్తిని ఉపయోగించడం చాలా ముఖ్యమన్నా రు. ప్రస్తుతం సోలార్ లైట్లు వంటి సౌరశక్తితో పనిచేసే పరిష్కారాలు పెద్ద పాత్ర పోషిస్తున్నాయన్నారు. పర్యావరణానికి అనుకూలమైన రోడ్డు లైటింగ్లో సోలార్ ఎనర్జీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సోలార్ లైట్లు డబ్బును ఆదా చేయడమే కాకుండా కార్బన్ ఉద్గారాలను తగ్గించడం ద్వారా వీధులను ప్రకాశవంతం చేస్తాయ న్నారు. అనంతరం ఎస్.ఇ.ఐ.ఎల్ ఎనర్జీ మంజూరు చేసిన 87 సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వేనాటి జితేందర్ రెడ్డి, ముసలి నాగరాజు, వేలపాలెం ధ్రువకుమార్ రెడ్డి, నెల్లిపూడి సుధాకర్, వెలసరి కోటేశ్వరరావు, నాగరాజు, గూడూరు భాస్కర్, వక్కలాకుల రమేష్, కామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్త లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సన్నారెడ్డి సురేష్‌రెడ్డి

కుష్టు నివారణపై అవగాహన

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

కుష్టు, క్షయ, ఎయిడ్స్ వ్యాధుల నివారణ పట్ల అవగాహన కలిగుండాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టిబి అధికారి డాక్టర్ ఎస్.కె ఖాదర్ వలీ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్ వలీ మాట్లాడుతూ క్షయ (టీబీ) వ్యాధి అనేది బ్యాక్టీ రియల్ ఇన్ఫెక్షన్ అని, ఇది సాధారణంగా ఊపిరి తిత్తులను ప్రభావితం చేస్తుందన్నారు. క్షయవ్యాధి దగ్గు, తుమ్మడం, ఉమ్మివేయడం ద్వారా గాలిలో కలుస్తుందని, తద్వారా ఆరోగ్యంవంతమైన వాళ్లకు ఈ వ్యాధి ప్రబలుతుందని తెలిపారు. ప్రపంచ జనాభాలో నాలుగింట ఒక వంతు మంది క్షయవ్యాధి బారినపడుతున్నారని చెప్పారు. ఇక కుష్టు వ్యాధి శరీర మంతా పుండ్లతో కనిపించే ఒక తిష్ట వ్యాధి అని చెప్పారు. ఈ వ్యాధి అంత సులభంగా అంటుకునే అంటు వ్యాధి కాదన్నారు. ఇది చర్మానికి నాడీసంబంధమైన దీర్ఘకాలికవ్యాధి అని చెప్పారు. ఇది క్షయ కారకమైన మైకో బాక్టీరియాకు దగ్గర సంబంధమైన దన్నారు. దీనిని గతంలో పెద్దరోగం లేదా పెద్ద జబ్బు అని కూడా వ్యవహరించేవారని తెలిపారు. ఎయిడ్స్ (ఎక్వైర్డ్ ఇమ్యూన్ డెఫిసియన్సీ సింద్రోం) వ్యాధి శరీరంలో రోగనిరోధక శక్తిని తగ్గిస్తుందని తెలిపారు. ఈ వ్యాధులపై అవగాహన కలిగుండాలని సూచిం చారు. అనంతరం ఆయన ఆర్వి కండ్రిగ ప్రాంతంలో పర్యటిం చారు. అక్కడ టీబీ, అడల్ట్ బిసి జి, లెప్రసీ, ఇతర ఆరోగ్య కార్యక్రమాలను పరిశీ లిం చారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక, జిల్లా డిఆర్ టివి కోఆర్డినేటర్, ఏపీఎంఒ, హెచ్ఈ ఓ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్

పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం

ప్రజాశక్తి-కలిగిరి

మండలంలోని వెంకన్న పాలెం ఎస్సి కాలనీలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఆర్ఒ రాజ్యం రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కుల పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పౌరహక్కుల భంగం కలిగిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిశుద్ధ రావు, ఆర్ఐ ఇమ్రాన్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో రుణాలు స్వాహా

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఓ సంఘబందంలో భారీ అవినీతి శుక్రవారం వెలుగు చూసింది. పొదుపు గ్రూపులో ఉన్నతి పథకం కింద ఎస్సి, ఎస్టిలకు వ్యక్తిగతంగా మంజూరు చేసే రుణాలు స్వాహా అయ్యాయి. తమకు తెలియకుండా తమ పేర్లతో రుణాలు స్వాహా అయిన విషయం తెలుసుకున్న బాధిత సభ్యులు నిర్ఘాంతపోయారు. సేకరించిన మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని పాపిరెడ్డిపాలెం సంఘబంధంలో రవి, సాయి పొదుపు గ్రూపులలో ఎస్సి, ఎస్టిలకు ఉన్నతి పథకం కింద మంజూ రైన రూ.3.50 లక్షలు ఫోర్జరీ సంతకాలతో గల్లంతు అయ్యాయి.రవి పొదుపు గ్రూపు లీడర్ ముగ్గురు పేర్లతో మంజూరైన రూ.2.10 లక్షలు, సాయి పొదుపు గ్రూపు లీడర్ ఇద్దరు సభ్యుల పేర్లతో మంజూరైన రూ.1.40 లక్షలు ఉన్నతి రుణాలు స్వాహా అయ్యాయి. తమకు తెలియకుండా తమ పేర్లతో మంజూరైన రుణాలు స్వాహా కావడంతో బాధిత సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సభ్యులు దరఖాస్తు చేయకుండానే రుణాలు ఎలా మంజూరయ్యాయి ? ఐదుగురు సభ్యుల పేర్లతో మంజూరైన రుణాలు ఇద్దరి బ్యాంక్ ఖాతాలో ఎలా జమ అ య్యాయి ? అనేది ఒక విచిత్రం. ఐదేళ్ల క్రితం ఆ గిపోయిన సాయి గ్రూపు ఖాతాలో రూ.1.40 లక్షలు జమ కావడం మరో విచిత్రం. ఈ అవినీతిలో కమ్యూనిటీ కో ఆర్డి నేటర్ హస్తం ఉందనేది సుస్పష్టం. ఏ రైణమైనా గ్రూపులోని సభ్యులు అందరూ అటు సీసీ, ఇటు బ్యాంక్ మేనేజర్ సమక్షంలో సంత కాలు పెట్టకుండా మంజూరు కావు అనే విషయం తెలి సిందే. ఈ నేపథ్యంలో సభ్యులు అందరూ సంతకాలు చేయకుండా, సిసికి తెలియకుండా రుణాలు ఎలా మం జూరయ్యాయి ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. "తి లా పాపం తలా పిడికెడు" అన్న చందంగా ఐదుగురు ఎస్సీ సభ్యుల పేర్లతో వారికి తెలియకుండా మంజూరైన రుణాలను ఇద్దరు లీడర్లు, సీసీ పం చుకున్నట్లు తెలిసింది. ఏదేమైనా ఉన్నతి పథకం కింద మంజూరైన రూ. 3.50 లక్షలు ఫోర్జరి సంతకాలతో స్వాహా కావడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కు లపై చర్యలు తీసుకోవాలని బాధిత సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫ్రాడ్ జరిగింది వాస్తవమే : సిసి

పాపిరెడ్డిపాలెం సంఘబందంలో రుణాలు గోల్మాల్ జరిగిన విషయం వాస్తవమేనని కమ్యూనిటీ కో ఆర్డినేటర్ స్పష్టం చేశారు. స్థానిక టీడీపీ నాయకులు మధ్యస్థం చేసి సర్దుబాటు చేస్తున్నారని సీసీ పేర్కొనడం గమనార్హం.

క్రీడలను ప్రారంభిస్తున్న నాయకులు

క్రీడాకారులు పథకాలు సాధించాలి

ప్రజాశక్తి-కోవూరు:కోవూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్లో రాష్ట్ర స్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీలకు జిల్లా స్థాయి క్రీడాకారులు సెలెక్షన్స్ సోమవారం జరిగాయి.ఈ కార్యక్రమా ని కి ముఖ్య అతిథిగా పాల్గొన్న కోవూరు మాజీ జెడ్పిటిసి సభ్యులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి మాటాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యమన్నారు.క్రీడలు విద్యార్థులకు మానసిక ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. 120 కోట్ల మంది జనం ఉన్నప్పటికి ఒలంపిక్స్ లాంటి గేమ్స్ లో మనం ఎక్కువ పథకాలు సాధించలేక పోతున్నా మన్నారు.మన దేశంలో క్రికెట్‌కు ఉన్నంత క్రేజ్ మరే ఆటకు లేకపోవడం కూడా దీనికి ఒక కారణం కావున క్రికెట్ తో పాటు అన్నిరకాల క్రీడలను పైన రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇక్కడ జిల్లా స్థాయి బాక్సింగ్ క్రీడాకారులు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నవంబర్లో కృష్ణాజిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఇక్కడఎంపికైన క్రీడాకారులు బాగా ప్రాక్టీస్ చేసి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో సత్తా చాటి ఎక్కువ పథకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అదేవిధంగా ఇక్కడ పీడీగా పనిచేస్తున్న దేవిక క్రీడల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ పాఠశాల నుండి మంచి క్రీడాకారులను తయారు చేస్తున్నారు.వారికి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.బాక్సింగ్ క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ వారికి కూడా అభినందనలు తెలియజేశారు ఈ సందర్భంగా నవంబర్లో రాష్ట్ర స్థాయిలో జరిగే బాక్సింగ్ పోటీలకు 13 మంది అమ్మాయిలు,13 మంది అబ్బాయిలను ఎంపిక చేశారు.కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీహరి, మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ శివుని నరసింహా రెడ్డి, విద్యా కమిటీ ఛైర్మెన్ షాహినా,చెంచులక్ష్మి, ఝాన్సి రాణి,జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి చేజర్ల కృష్ణారెడ్డి, పీడీ లు దేవిక, సివాజ్ అహ్మద్, రమణయ్య, పుల్లమ్మ, రేణుక, అరోర, కల్పన కుమార్ పిఇటిలు పాల్గొన్నారు.

3న జిల్లా విజన్ ప్లాన్ వర్క్ షాప్

ప్రజాశక్తి -నెల్లూరు

స్వర్ణాంధ్ర 2047 జిల్లా ,మండల విజన్ ప్రణాళికకు సంబంధించిన వర్క్ షాప్ అక్టోబర్ మూడో తేదీన నగరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల మూడో తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో విజన్ ప్లాన్ వర్క్ షాప్ జరుగుతుందని, వర్క్ షాప్‌నకు జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి శాసనసభ్యులు, జిల్లా స్థాయి ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని రైతు సంఘాలు, ఎన్.జి.ఒ లు, వ్యాపార వాణిజ్య సంఘాలు, విద్యావేత్తలు, ఆర్థిక వేత్తలు, ప్రముఖ వ్యక్తులు, పాల్గొని తమ విలువైన సలహాలు సూచనలు ఇచ్చి రాబోయే ఐదేళ్ల కు జిల్లా విజన్ ప్రణాళిక తయారు చేయడానికి సహకరించాలని కోరారు.